# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ హైదరాబాద్‌లోని గుల్జార్ హౌస్‌లో ఈరోజు జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు.
- ❖ దేశవ్యాప్తంగా 2029 నాటికి ప్రతి పంచాయతీలో ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలను ఏర్పాటు చేయనున్నామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు.
- ❖ కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిల పక్ష బృందాలు ఐరాస భద్రతా మండలి సభ్య దేశాలకు వెళ్లనున్నాయని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.
- ❖ నైరుతి రుతుపవనాలు మరో 10 రోజుల్లో కేరళ తీరాన్ని తాకనున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25న ప్రసారమవుతుంది.

==========================

హైదరాబాద్ చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్‌లో ఈరోజు భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగడంతో జరిగిన ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, నలుగురు మహిళలు కూడా ఉన్నారు. అగ్ని ప్రమాదం సంబవించాక భవనంలో ఉన్న పలువురు ఊపిరి ఆడక స్పృహ కోల్పోగా వారిని ఉస్మానియా, యశోద, డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. కొందరు ఘటనాస్థలంలోనూ. మరికొందరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఇక ఈ ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మహిళలు, పిల్లలు సహా అనేక మంది మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేసిన రాష్ట్రపతి గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం కలచివేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని

ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయలు, క్షతగాత్రులకు 50 వేల రూపాయల పరిహారం అందిస్తామన్నారు.

అలాగే గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కక తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

దేశవ్యాప్తంగా 2029 నాటికి ప్రతి పంచాయతీలో ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో సైన్స్ సిటీలో నిర్వహించిన సహకార సదస్సులో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రద్దు చేయబడిన ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాల (PACS) ఆర్థిక పునరుద్ధరణ లక్ష్యంగా కొత్త విధానానికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించమన్నారు. వీటిని పునరుద్ధరించడం ద్వారా దేశంలో సహకార మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సహకార సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడం, ఈ వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడానికి సాంకేతికత, దేశంలో సహకార నెట్‌వర్క్‌ను విస్తరించడంపై దృష్టి పెట్టాలని అమిత్ షా సూచించారు.

==========================

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టిన చర్యలను ప్రపంచ యవనికపై వివరించేదుకు కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిల పక్ష బృందాలు ఐరాస భద్రతా మండలిలోని దేశాలకూ వెళ్లనున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. 59 మంది పార్లమెంటు సభ్యులతో కూడిన ఈ 7 బృందాలు మొత్తం 32 దేశాలను సందర్శిస్తాయని పేర్కొన్నారు. ఈ బృందాలు ఏయే దేశాలకు వెళ్తాయనే జాబితాను ఈరోజు ఆయన వెల్లడించారు.

==========================

ఇజ్రాయెల్ గాజాపై భీకర దాడులను కొనసాగిస్తోంది. నిన్న అర్ధరాత్రి పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరపడంతో ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26 మంది మరణించారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కాగా ఈ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఇటీవల కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే ఈ దాడులను తీవ్రం చేశామని తెలిపారు. తమ బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోందని, అమెరికా ప్రతిపాదించిన కాల్పుల ఒప్పందం కొనసాగింపును తిరస్కరించిందన్నారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

==========================

భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపధ్యంలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ముగుస్తున్నట్లు వస్తున్న వార్తలను భారత రక్షణ మంత్రిత్వ వర్గాలు ఖండించాయి. కాల్పుల విరమణ అవగాహనకు ముగింపు తేదీ లేదని స్పష్టం చేశాయి. ఈ నెల 10న ప్రకటించిన కాల్పుల విరమణ అవగాహనే కొనసాగుతోందని వెల్లడించాయి. ఆ రోజు జరిగిన ఇరు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (DGMOs) చర్చల్లో నిర్ణయానికి కాలపరిమితి లేదని వివరించాయి.

===========================

భారత్‌లో అనేక ఉగ్రదాడులకు పాల్పడిన లష్కరే తోయ్యిబా ఉగ్రవాది అబు సైఫుల్లా ఈరోజు మరణించాడు పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో మధ్యాహ్నం తన నివాసం నుంచి బయటకు వెళ్లిన సైఫుల్లాపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి హతమార్చారని అధికారులు వెల్లడించారు. 2006లో ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో అబు సైఫుల్లా ప్రధాన సూత్రధారి. 2001లో సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై, అలాగే 2005లో బెంగళూరులోని ఐఐఎస్సీపై జరిగిన దాడుల్లోనూ అతడి ప్రమేయం ఉంది.

===========================

ఆపరేషన్ సిందూర్ విజయానికి సంఘీభావంగా భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనాలను తెలుపుతోంది. సాయుధ దళాలకు నివాళిగా ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా కార్గిల్ యుద్ధంలో అసాధారణమైన ధైర్యసాహసాలను ప్రదర్శించిన పరమ వీర చక్ర అవార్డు గ్రహీత యోగేంద్ర సింగ్ యాదవ్ గురించి ఈ రోజు తెలుసుకుందాం.

(వాయిస్ 49 సెకన్లు)

===========================

పంచ కేదార్‌నాథ్ క్షేత్రాల్లో ఒకటైన ప్రపంచ ప్రఖ్యాత రుద్రనాథ్ ఆలయ ద్వారాలు ఈరోజు తెరుచుకున్నాయి. ఉత్తరాఖండ్‌లోని గఢ్వాల్ హిమాలయ ప్రాంతంలో కొలువైన ఈ దివ్యక్షేత్రాన్ని ఈరోజు తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. చమోలి జిల్లాలోని 11,800 అడుగుల ఎత్తులో ఛమోలీ జిల్లాలో ఉన్న ఈ ఆలయంలో ఉదయం సంప్రదాయ పూజలు నిర్వహించారు. ఈ క్షేత్రాన్ని చేరుకొనేందుకు 20 కిలో మీటర్ల మేర ట్రెక్కింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

===========================

నైరుతి రుతుపవనాలు మరో 10 రోజుల్లో కేరళను తాకనున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. ఇవి ఈ నెల 22న అండమాన్‌ను, 26న శ్రీలంకను తాకొచ్చని భావించగా.. అందుకు పది రోజుల ముందుగానే శ్రీలంకలోకి ప్రవేశించాయని వెల్లడించింది. ప్రస్తుతం శ్రీలంక, అండమాన్‌లో విస్తరించాయని, ఈ నెల 27వ తేదీ నాటికి కేరళను తాకే అవకాశం కనిపిస్తోందని ఐఎండీ తెలిపింది. రాబోయే రోజుల్లో మరింత వేగంగా కదలడానికి అనుకూల పరిస్థితులున్నాయని వెల్లడించింది.

===========================

మహారాష్ట్ర తీరం వెంబడి, కొంకణ్, మధ్య మహారాష్ట్రలోని రానున్న ఐదు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) పేర్కొంది. దీంతో ఈ ప్రాంతాలలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

===========================
===========================